అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సత్యశారద

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

- రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి
- కలెక్టర్ సత్య శారద
- ఖమ్మం హైవేలో ప్రమాదాల నివారణపై అధికారులతో సమీక్ష

ఖిలావరంగల్, జనవరి 28: ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని వీసీ హాల్‌లో మంగళవారం రోడ్డు ప్రమాదాల నివారణపై నేషనల్ హైవే, ఆర్‌అండ్‌బీ అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ నెల 26న ఖమ్మం ప్రధాన రహదారిలోని మామునూరులో ఇటీవల ఓవర్ లోడ్‌తో పాటు లారీ డ్రైవర్ మద్యం తాగి ఉండడం వల్ల జరిగిన భారీ రోడ్డు ప్రమాదంపై చర్చించారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఖమ్మం హైవేపై 7 కిలో మీటర్ల వరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. రోడ్డు పక్కన నో షాపింగ్, నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమీక్షలో డీసీపీ రవీందర్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, సీనియర్ ఎంవీఐ జయపాల్ రెడ్డి, నేషనల్ హైవే పీడీ దివ్య, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం మామునూరు ఎయిర్‌పోర్టుపై సమీక్షించారు. గుంటూరుపల్లి రైతులు కోరినట్లు కనెక్టివిటీ రోడ్డు నిర్మాణం సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఆర్‌అండ్‌బీ అధికారులు, ఖిలావరంగల్ తహసీల్దార్ నాగేశ్వర్‌రావును ఆదేశించారు.

ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

వ్యవసాయ మార్కెట్‌లో ఉద్యోగుల నిరసన

ఉద్యోగులపై దాడి చేయొద్దని విజ్ఞప్తి

కాశీబుగ్గ, జనవరి 28: ఇటీవల అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి నర్సింహులు, సిబ్బందితోపాటు కార్యాలయంపై చేసిన దాడిని ఖండిస్తూ వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో మంగళవారం ఉద్యోగులు నిరసన తెలిపారు. మార్కెటింగ్ శాఖ కేంద్ర ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు జిల్లా అధ్యక్షుడు జన్ను భాస్కర్, ప్రధాన కార్యదర్శి గంధమల్ల రాజేందర్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో జేడీఎం ఉప్పుల శ్రీనివాస్ మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు కోసమే ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని, రైతుల విషయంలో పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అధికారుల విధుల నిర్వహణను రైతులు తప్పుగా భావించొద్దని కోరారు. అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి వ్యవసాయ ఉత్పత్తుల ధరలు నిర్ణయిస్తారని వివరించారు. కార్యక్రమంలో డీడీఎం వొడితల పద్మావతి, డీఎంవో కలకోట్ల సురేఖ, కార్యదర్శి పోలెపాక నిర్మల, వివిధ మార్కెట్ కమిటీల కార్యదర్శులు పి.అశోక్, శ్రీరామోజు రాము, ధన్నపునేని అంజిత్‌రావు, డీఈవోలు, సెక్యూరిటీ గార్డు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

డిస్పెన్సరీ ఎదుట నిరసన తెలుపుతున్న ఈఎస్ఐ ఉద్యోగులు

'ఈఎస్ఐ ఆస్పత్రులను సొసైటీల్లో కలపొద్దు'

కాశీబుగ్గ, జనవరి 28: రాష్ట్రలో ఉన్న కార్మికుల బీమా ఆసుపత్రులను (ఈఎస్ఐ) ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించాలని, సొసైటీల్లో కలపొద్దని ఈఎస్ఐ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు మంగళవారం వారు కాశీబుగ్గ వివేకానందకాలనీలోని డిస్పెన్సరీ ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యం, సిబ్బంది స్వర్ణలత, శశాంక్‌కుమార్, కళావతి, మంజుల, సృజన, సుదర్శన్, సారంగపాణి, ఉదయ్ పల్లె, ఎండీ రఫీ, సబిత, దీపిక, రుక్సాన, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎంజీఎంలో గుండె వైద్య శిబిరం

గిర్మాజీపేట, జనవరి 28: కమిషనర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, హైదరాబాద్ ఆదేశాల మేరకు గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎంజీఎం దవాఖానలో ఉచితంగా గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో సాంబశివరావు మంగళవారం తెలిపారు. ఆర్‌బీఎస్‌కే, డీఈఐసీ, అపోలో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో గుండె సంబంధిత సమస్యలు ఉన్న 18 ఏండ్లలోపు వయస్సు కలిగిన పిల్లలకు ఉచితంగా టూడీ ఎకో వైద్య పరీక్షలు చేస్తామని ఆయన చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వారంతా నిర్ణీత సమయానికి వచ్చి వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు.

డీటీఎఫ్ నూతన కార్యవర్గం

ఖానాపురం, జనవరి 8: డీటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నర్సింహులు, ఉపాధ్యక్షులుగా రాజశేఖర్, మోతీలాల్, సుమలత, ప్రధాన కార్యదర్శిగా జగన్, కార్యదర్శులుగా సంతోష్, వాగ్య, సురేందర్, జిల్లా కౌన్సిలర్లుగా యాకయ్య, రజితాదేవి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా వెంకటయ్య, కో కన్వీనర్‌గా శ్రీనివాస్, సభ్యులుగా సూరయ్య, లక్ష్మయ్య ఎన్నికయ్యారు.

రైతులు సభ్యత్వాలు తీసుకోవాలి

ఖానాపురం, జనవరి 28: పీఏసీఎస్ నుంచి రుణాలు పొందే రైతులు సభ్యత్వాలు తీసుకోవాలని ఓడీసీఎంస్ చైర్మన్ రామస్వామి కోరారు. తీసుకున్న రుణాలను వ్యవసాయానికి పెట్టుబడిగా వాడుకోవాలని సూచించారు. సొసైటీలో సభ్యత్వాని రైతు రూ. 330 చెల్లించాలని కోరారు.

'పరిరక్షణ కమిటీ' సమావేశం

ఖిలావరంగల్, 28: ఖిలావరంగల్‌లో 1972లో స్థాపించిన శ్రీహనుమాన్ వ్యాయామశాల పరిరక్షణ కమిటీ పూర్వ సభ్యులు మంగళవారం సమావేశమయ్యారు. వ్యాయామశాలకు చెందిన 435 చదరపు గజాల స్థలం అన్యాక్రాంతం కాకుండా పలు తీర్మానాలు చేశారు. పుట్ట రాజేశ్వర్, సారంగపాణి, సుధాకర్, రాజగోవిందు, రాములు, కోటేశ్వర్‌రావు, చక్రధారి, ధనుంజయ, సారంగపాణి, సుదర్శన్ పాల్గొన్నారు.

చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయాలి

- ఉన్నతాధికారులకు మంత్రి సురేఖ ఆదేశం
- చేనేత ఉత్పత్తుల నిల్వల పరిశీలన

పోచమ్మమైదాన్, జనవరి 28: వరంగల్‌లోని పలు చేనేత సంఘాల్లో నిల్వ ఉన్న బెడ్‌షీట్లను కొనుగోలు చేయాలని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సంబంధిత అధికారులను ఆదేశించారు. వరంగల్ 12వ డివిజన్‌లోని కాశీవిశ్వేశ్వర చేనేత సహకార సంఘంలో పేరుకుపోయిన 2 లక్షల బెడ్‌షిట్లను మంగళవారం ఆమె పరిశీలించారు. వెంటనే మంత్రి స్పందించి చేనేత మేనేజింగ్ డైరెక్టర్ శైలజా రామయ్యర్‌కు ఫోన్ చేశారు. సంఘాల్లో నిల్వ ఉన్న స్టాక్‌ను వెంటనే కొనుగోలు చేసి, చేనేత కార్మికులకు చేతినిండా పని కల్పించాలని ఆదేశించారు. దీంతో టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు, సంఘం పర్సన్ ఇన్‌చార్జి కూరపాటి సంపత్ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

చేనేత ఉత్పత్తులను ఖరీదు చేయాలని ఉన్నతాధికారితో ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి సురేఖ

తుమ్మలకుంటను అభివృద్ధి చేస్తాం

పోచమ్మమైదాన్/కరీమాబాద్: వరంగల్ 12వ డివిజన్‌లోని తుమ్మలకుంటను అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని మంత్రి సురేఖ అన్నారు. తుమ్మలకుంట పరిసరాల్లో రూ. 30 లక్షలతో నిర్మించ తలపెట్టిన డ్రైనేజీ, సీసీరోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని డివిజన్లలో దశలవారీగా అభివృద్ధి పనులు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, ఈఈ శ్రీనివాస్, వరంగల్ తహసీల్దార్ ఎండీ ఇక్బాల్, స్థానిక కార్పొరేటర్ కావటి కవిత రాజు, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు. అలాగే, వరంగల్ 32, 41వ డివిజన్లలో మంత్రి సురేఖ కార్పొరేటర్లతో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అంతేకాకుండా రంగశాయిపేటకు చెందిన మాజీ కార్పొరేటర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బొలుగొడ్డు సారయ్య సతీమణి విమలాదేవి మరణించగా, బాధిత కుటుంబాన్ని మంత్రి సురేఖ, తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, కార్పొరేటర్లు గుండు చందన, పోశాల పద్మ, మాజీ కార్పొరేటర్లు కేడల పద్మ, కత్తెరశాల వేణుగోపాల్ తదితరులు పరామర్శించారు.

ప్రతిభను వెలికితీసేందుకు ఎగ్జిబిట్లు దోహదం

- ప్రభుత్వ సీకేఎం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ శశిధర్‌రావు
- కళాశాలలో సైన్స్ ప్రదర్శనలు

పోచమ్మమైదాన్, జనవరి 28: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపయోగపడతాయని ప్రభుత్వ సీకేఎం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శశిధర్‌రావు అన్నారు. వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం కళాశాలలో జూగుల్ ఫెస్ట్-2025ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎగ్జిబిట్లు ప్రదర్శించారు. అనంతరం ప్రిన్సిపాల్ శశిధర్‌రావు మాట్లాడుతూ.. ఈ ప్రదర్శనలో విద్యార్థులు చురుగ్గా పాల్గొని, తమ సృజనాత్మకతను చాటుకున్నారని తెలిపారు. దీంతో పాటు వ్యాసరచన, పాటలు, నృత్య విభాగాల్లో కూడా విద్యార్థులు ఉత్సాహంగా ముందుకొచ్చారని కొనియాడారు. హ్యూమానిటీస్, సైన్స్, ఆర్ట్స్, కామర్స్ విభాగాల్లో ఏర్పాటు చేసిన ఉత్తమ ఎగ్జిబిట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ధర్మారెడ్డి, జూగుల్ ఫెస్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎల్‌వీ వరప్రసాద్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సతీశ్‌కుమార్, కన్వీనర్ అనిల్ కుమార్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సైన్స్ ప్రదర్శనను తిలకిస్తున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు

'సూపర్‌స్పెషాలిటీ'ని వేగంగా పూర్తి చేయాలి

సీఎంను కోరిన ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు

హనుమకొండ, జనవరి 28: వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, రాంచంద్రూనాయక్, గండ్ర సత్యనారాయణ రావు, కేఆర్ నాగరాజు, మామిడాల యశస్వినీ రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రిని కలిసి సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌పై చర్చించారు. అలాగే, రాంపూర్, మడికొండ మధ్య బల్దియా నిర్వహిస్తున్న డంపింగ్ యార్డు ద్వారా గాలి, తాగునీరు కలుషితమవుతోందని, విపరీతమైన పొగ ద్వారా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే డంపింగ్ యార్డును తరలించాలని కోరారు.

మండలానికో గ్రామం ఎంపికైతే సంబురాలా..

కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించిన బీఆర్ఎస్

నెక్కొండ, జనవరి 28: మండలంలో 39 గ్రామ పంచాయతీలు ఉండగా, అందులో కేవలం ఒకేఒక గ్రామం ప్రభుత్వం అందించే నాలుగు సంక్షేమ పథకాలకు పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైతే కాంగెస్ నాయకులు సంబురాలు జరుపుకోవడం ఏమిటని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య ప్రశ్నించారు. మండలకేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మిగతా గ్రామాల ప్రజలు కూడా దరఖాస్తు చేసుకున్నారని గుర్తుచేశారు. వారి పరిస్థితి ఏమిటని, వారికి నాలుగు పథకాలు ఎప్పుడు అందిస్తారో కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మండలంలో రైతు భరోసా నిధులు రూ. 14.88 కోట్లకు రూ. 41 లక్షలు విడుదల చేసి సర్కారు చేతులు దులుపుకుందని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు గత అసెంబ్లీ ఎన్నికల ముంగిట రైతు భరోసా పథకంలో ఎకరానికి ఏటా రూ. 17,500 పెట్టుబడి సాయం అందజేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చిన వెంటనే మాట మార్చి రూ. 12 వేలు ఇస్తామని ప్రకటించడం దారణమన్నారు. నిధులు అందించడంలో మాత్రం ప్రభుత్వం కాలయాపన చేస్తుండడం రైతులను కష్టాల్లోకి నెట్టివేయడమేనని ఎద్దేవా చేశారు.

నేడు బల్దియా సర్వసభ్య సమావేశం

వరంగల్, జనవరి 28: బల్దియా సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నారు. కాగా, సమావేశాలు ప్రజా సమస్యలు గాలికి వదిలి.. వ్యక్తిగత ఏజెండాలతో అర్థరహితంగా సాగుతున్నాయి. అధికార, ప్రతిపక్ష సభ్యుల వాగ్వాదాలు, ఎదురుదాడులతో సమయం వృథా అవుతోందనే విమర్శలు ఉన్నాయి. నేడు జరిగే ఈ సమావేశంలో ప్రజాసమస్యలు చర్చకు వచ్చేనా! అనే అభిప్రాయాలు నగరవాసుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా గ్రేటర్ కార్పొరేషన్ కోతులు, కుక్కల బెడద తీవ్రంగా ఉంది. లీకేజీలతో తాగునీటి సమస్యలు అనేకం తలెత్తుతున్నాయి. నగరంలో అంతర్గత రహదారులతో అధ్వానంగా మారాయి. స్మార్ట్‌సిటీ నిధులతో చేపట్టిన అనేక అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. నగరవాసులు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై కౌన్సిల్ సమావేశంలో చర్చించాలని సగటు నగరవాసి కోరుకుంటున్నారు.

చికిత్స పొందుతూ తాపీమేస్త్రీ మృతి

ఖిలావరంగల్, జనవరి 28: చికిత్స పొందుతూ తాపీమేస్త్రీ మృతి చెందిన ఘటన మంగళవారం ఎంజీఎం దవాఖానలో జరిగింది. మిల్స్‌కాలనీ సీఐ జూపల్లి వెంకటరత్నం కథనం ప్రకారం.. ఉర్సు నాగేంద్రనగర్‌కు చెందిన తాపీమేస్త్రీ శివరాత్రి రాజు(45) ఈ నెల 27న పనులు ముగించుకొని ఇంటికి వెళ్లేందుకు మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ సమీపంలో రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని అంబులెన్స్‌లో ఎంజీఎం దవాఖానకు తరలించారు. ఈ క్రమంలో చికిత పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రైవేటు ఉద్యోగి అదృశ్యం

ప్రైవేటు ఉద్యోగి అదృశ్యమైన ఘటన అబ్బనికుంటలో జరిగింది. సీఐ వెంకటరత్నం కథనం ప్రకారం.. ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్న అబ్బనికికుంటకు చెందిన కోమాకుల కృష్ణప్రసాద్(35) మడికొండలోని శివాలయానికి వెళ్లి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పాడు. సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు. బంధుమిత్రుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతడి భార్య ప్రియాంక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

వైద్యం కోసం వస్తే ప్రాణం పోయింది..

- గుండెపోటుతో హనుమకొండ వాసి మృతి
- ఎంజీఎం హాస్పిటల్ ఓపీ విభాగంలో ఘటన

పిక్కల శ్రీనివాస్ మృతదేహం

వరంగల్‌చౌరస్తా, జనవరి 28: వైద్యం కోసం వచ్చిన ఒకరు అందరూ చూస్తుండగానే గుండెపోటుతో ప్రాణాలు వదిలిన ఘటన వరంగల్ ఎంజీఎం దవాఖాన ఔట్ పేషెంట్(ఓపీ) విభాగంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం ఉదయం హనుమకొండ హంటర్‌రోడ్డులోని న్యూశాయంపేట ప్రాంతానికి చెందిన పిక్కల శ్రీనివాస్(45) అనారోగ్య సమస్యలతో ఎంజీఎంహెచ్ ఓపీ విభాగానికి వచ్చాడు. పేరు నమోదు చేసుకొని బయటకు వచ్చి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అక్కడే విధుల్లో ఉన్న సెక్యూరిటీ సిబ్బంది బాధితుడిని అత్యవసర విభాగానికి తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలోనే శ్రీనివాస్‌కు గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శరత్

'యూజీసీ గైడ్‌లైన్స్‌ను వెనక్కి తీసుకోవాలి'

ఖిలావరంగల్, జనవరి 28: యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తికి విఘాతం కలిగిస్తున్న యూజీసీ గైడ్‌లైన్స్‌ను వెంటనే వెనక్కితీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదర్ల శరత్ డిమాండ్ చేశారు. శివనగర్ తమ్మెర భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఏఐఎస్ఎఫ్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర యూనివర్సిటీల వీసీల నియామకాల్లో రాష్ట్రాలకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని కోరారు. రాజకీయాలకతీతంగా విద్యారంగానికి సంబంధించిన వారినే వీసీలుగా నియమించాలన్నారు. సమావేశంలో నాయకులు సీచ్ హరీశ్, శివ, శరత్, సందీప్, సాగర్ పాల్గొన్నారు.

వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డ్యాగల శ్రీనివాస్

సమర శంఖారావాన్ని జయప్రదం చేయాలి

నర్సంపేట, జనవరి 28: ఈ నెల 30న నిర్వహించ తలపెట్టిన బీసీ విద్యార్థుల సమర శంఖారావం చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డ్యాగల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలంలోని లక్నేపల్లిలో మంగళవారం బీసీ విద్యార్థుల సమర శంఖారావం ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వాలు చెలగాటం ఆడుతుండడం సిగ్గు చేటని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు వీరస్వామి, బేతి భాస్కర్, విజయ, మంజుల, లక్ష్మీ, శ్రీదేవి పాల్గొన్నారు.

గురిజాలలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

బాలికల సాధికారతే దేశాభివృద్ధికి పునాది

నర్సంపేట, జనవరి 28: బాలికల సాధికారతతోనే దేశాభివృద్ధికి పునాది పడుతుందని జెండర్ స్పెషలిస్టు రమాదేవి అన్నారు. మండలంలోని గురిజాల జడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలు పట్టుదలతో చదివితే సాధించలేనిది ఏదీ లేదన్నారు. చదువు జీవితానికి వెలుగునిస్తుందని చెప్పారు. ఉన్నత చదువులతో బాలికలు సమాజంలో సమాన అవకాశాలు పొందొచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాయబోసు, చంద్రశేఖర్, చంద్రకళ, నాగరాణి, రవికుమార్, రవీందర్, రమేశ్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ మోసాలను గమనిస్తున్న ప్రజలు'

గీసుగొండ, జనవరి 28: కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలు నిత్యం గమనిస్తూనే ఉన్నారని మాజీ జడ్పీటీసీ పోలీసు ధర్మారావు అన్నారు. కోనాయిమాకులలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 26న నాలుగు సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందజేస్తామని చెప్పిన ప్రభుత్వం ఐదు రోజులపాటు గ్రామాల్లో విస్తృతంగా గ్రామసభలు నిర్వహించిందని గుర్తుచేశారు. చివరకు మండలానికో గ్రామాన్ని ఎంపిక చేయడం వెనక ఉన్న కుట్రను ప్రజలు గమనించాలని కోరారు. మిగతా గ్రామాల్లో రైతు భరోసా కోసం ఎదురు చూస్తున్నారన్నారు. వారికి కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల సమయం వృథా చేసి వారి నుంచి దరఖాస్తులు ఎందుకు తీసుకున్నారో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

డాక్యుమెంట్స్ పోయినవి
అజ్జీర కళ్యాణి,భర్త: పెద్దన్నకుమార్, R/o ఇ.నెం. 3-285/6/5B, అమరావతినగర్, హన్మకొండ. డాక్యుమెంట్స్ నెం. 7899/2015 గలవి ఖమ్మం నుండి మోదుగడ్డ తండాకు బైక్‌పై వస్తున్న క్రమంలో పోయినవి. ఎంత వెతికినా దొరకలేదు. దొరికినవారు సంప్రదించగలరు.
సెల్: 7893283005

CHANGE OF NAME
I, SUKANYA (Old Name) W/o: ARSHANAPALLY SREEDHAR RAO, CHANGED MY NAME AS ARSHANAPALLY SUKANYA (New Name) W/o: ARSHANAPALLY SREEDHAR RAO, R/o: HANAMKONDA -506001, TGS, INDIA.
NTW-7709

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

'అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదు'

వరంగల్, జనవరి 28: గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్‌లో కొంతమంది అధికారులు ప్రొటోకాల్ పాటించక అవమానిస్తున్నారని బీఆర్ఎస్ కార్పొరేటర్ మరుపల్ల రవి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడేను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ నెల 22న అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని ఉర్సు దర్గా ప్రాంతంలో బల్దియా ఆధ్వర్యంలో అన్నపూర్ణ పథకాన్ని మంత్రి కొండా సురేఖ ప్రారంభించారని తెలిపారు. అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో స్థానిక కార్పొరేటర్ అయిన తన ఫొటో ముద్రించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డిని ప్రశ్నిస్తే నిర్లక్షంగా సమాధానం చెప్పారని, అధికారులు ప్రొటోకాల్ పాటించేలా చూడాలని కోరారు.

పైవేటు ఆసుపత్రిలో మహిళ మృతి

రాజమ్మ (ఫైల్)

వర్ధన్నపేట, జనవరి 28: మండలకేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మండలకేంద్రంలోని కాలనీకి చెందిన ల్యాదెల రాజమ్మ(45) గర్భసంచికి సంబంధించిన వ్యాధితో పట్టణంలోని ఓప్రైవేటు ఆసుపత్రిలో చేరింది. పరీక్షలు చేసి డాక్టర్లు ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు. ఈ నెల 25న వైద్యులు రాజమ్మకు ఆపరేషన్ చేశారు. మంగళవారం ఉదయం ఆమె ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది వచ్చింది. వైద్యులు చికిత్స అందించేందుకు ప్రయత్నించినా రాజమ్మ మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే రాజమ్మ మృతి చెందిందని మృతురాలి భర్త ల్యాదెల ఆనందం, అతడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ ఆసుపత్రిలో ఆందోళన చేశారు. కాగా, విషయం బయటకు రాకుండా మృతురాలి కుటుంబ సభ్యులతో వైద్యుడు అంతర్గత ఒప్పందం కుదుర్చుకున్నట్లు పట్టణంలో చర్చ జరుగుతున్నది.

బాలికల వసతి గృహంలో కమిషనర్ బస

కరీమాబాద్, జనవరి 28: వరంగల్ ఉర్సు గుట్టలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో సోమవారం రాత్రి జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే రాత్రిపూట బస చేశారు. ఈ సందర్భంగా విద్యాలయంలో పలు విభాగాలను పూర్తిగా పరిశీలించి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. రాత్రి సమయంలో విద్యార్థులు పలు కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కమిషనర్ బస చేశారు.

'సభకు భారీగా తరలిరావాలి'

వర్ధన్నపేట, జనవరి 28: వచ్చే నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్ష డప్పులు-వేలగొంతుల సభకు భారీగా తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి బిర్రు మహేందర్ మాదిగ పిలుపునిచ్చారు. ఈ మేరకు కడారిగూడెంలో మంగళవారం జరిగిన ఆయన మట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చినా రాష్ట్ర